ఆంధ్రజ్యోతి
అనంతపురం
జిల్లా వార్తలు

శనివారం 22 జూన్ 2024

యోగాతో శాంతి.. సంతృప్తి

■ కలెక్టర్ వినోద్‌కుమార్ ■







పరేడ్ మైదానంలో యోగాసనాలు





కలెక్టర్ వినోద్ కుమార్



ఎస్పీ



నగరపాలిక కమిషనర్





జడ్పీ సీఈఓ





ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ అధికారులు



అంతటా.. యోగా..

యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఖ్యాతి మన దేశానికి దక్కడం గర్వకారణమని అన్నారు. జిల్లా యువజన శాఖ, అయుష్, వివేకానంద యోగా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యం యోగాసనాలు వేయాలని, తద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నారు. ఒత్తిళ్ల నడుమ సాగుతున్న జీవితం సంతృప్తి కరంగా, శాంతియుతంగా సాగుతుందని అన్నారు. ఎస్పీ గౌతమి శాలి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ నిదియ, నగర పాలిక కమిషనర్ మేఘ స్వరూప్, అడిషినల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. - అనంతపురం క్లాక్‌టవర్

ఇంకా స్వామిభక్తి..!

రాక్రీట్ సేవలో గృహ నిర్మాణశాఖ

బలవంతంగా ఉపాధి బిల్లుల వసూలు

ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోయినా బరితెగింపు

రాప్తాడు మాజీ ఎమ్మెల్యే సేవలో అధికారులు



కొడిమిలోని జగనన్న లేఅవుట్

అనంతపురం సిటీ, జూన్ 21: రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. అధికారులు కూడా మారిపోతున్నారు. కానీ గృహనిర్మాణ శాఖలో మాత్రం కొందరు అధికారులు ఇంకా వైసీపీ సేవలో తరిస్తున్నారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారుల విషయంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ గుట్టుగా వ్యవహారం నడిపిస్తోంది. లబ్ధిదారులపై ఒత్తిడి చేసి ఉపాధి బిల్లులు వసూలు చేస్తోంది. మాజీ ఎమ్మెల్యే ఆదేశాలను ఆ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికీ పాటిస్తున్నారు. ఏమాత్రం ఆలోచన చేయకుండా బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉద్యోగులను గ్రూపులుగా విభజించి మరీ వసూళ్లకు ఉసిగొల్పుతున్నారని సమాచారం.

ఇప్పటికీ అటువైపే..

జగనన్న ఇళ్ల నిర్మాణాల విషయంలో వైసీపీ హయాంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఏదీ చెబితే దానికి గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు తల ఊపారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వారు మారలేదు. రాక్రీట్ సంస్థకు 90 రోజుల పని దినాలకు రావాల్సిన బిల్లులు కోసం తెర వెనుక కథ నడిపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే రచించిన పథకాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు అమలు చేస్తున్నారు. ఆ శాఖ ఉన్నతాధికారితోపాటు ఓ డీఈఈ స్వామిభక్తిని చాటుకుంటున్నారు. ఇద్దరు అధికారులు నగరంతో పాటు శివారు మండలాలకు చెందిన తమ శాఖ సిబ్బందిని గ్రూపులుగా విభజించి, లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. బిల్లులకు సంబంధించిన డబ్బులను వసూలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. అంతే సంగతులు అన్నట్లు పరిస్థితి తయారయిందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఉద్యోగులు ప్రశ్నించడంతో ఉన్నతాధికారులు ఆగ్రహించారని సమాచారం. ఈ వ్యవహారంలో ఓ డీఈఈ ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారని ఆ శాఖ వర్గాల్లో చర్చసాగుతోంది. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అండదండలతో విధి నిర్వాహణలో ఆయన రెచ్చిపోయి వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో తన స్థాయి అధికారులపై కూడా కస్సుబుస్సులాడారని తెలుస్తోంది.



ఆలమూరు లే అవుట్..

లబ్ధిదారుల మండిపాటు

రాక్రీట్ సంస్థ అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి, ఆలమూరు, బుక్కరాయసముద్రం మండల పరిధిలోని సిద్దరాంపురంలో 7,671 ఇళ్లను నిర్మిస్తోంది. వీటిలో కేవలం 350 ఇళ్లు పూర్తి చేసింది. మిగిలిన 7,321 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయి. వీటిలో 90 శాతం పునాదులకు పరిమితమయ్యాయి. ఇక్కడే అసలు కథ మొదలైంది. ప్రతి ఇంటికి ఉపాధి కింద (90 రోజుల పని దినాల కింద) రూ. 30 వేలు అందిస్తున్నారు. అదీ కూడా లబ్ధిదారుడి అకౌంట్‌కు వేసి ఆ తర్వాత రాక్రీట్ సంస్థకు ఇవ్వాల్సి ఉంది. ఇంటి నిర్మాణం పూర్తయితేనే ఈ బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ నిర్మాణాలు అంతంత మాత్రంగానే ఉన్నప్పటికి ప్రతి ఇంటికి రూ.30 వేలు చొప్పున వసూలు చేసేలా రాక్రీట్ సంస్థ పథకం వేసింది. ఇందుకు ఆ శాఖ అధికారులు తల ఊపడం విస్మయం కలిగిస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తి కాకపోయినా ఆ శాఖ ఉద్యోగులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి అకౌంటులో పడిన రూ.30 వేలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. కొందరు లబ్ధిదారులు చెల్లించగా మరికొందరు వ్యతిరేకించారు. కొందరు వాగ్వాదానికి దిగగా, మరికొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఉద్యోగులపై మండిపడ్డారు. ఇప్పటికీ ఈ తతంగం సాగుతోందని సమాచారం. ఈ బిల్లులు జిల్లాలో లక్షల్లో.. రాష్ట్ర వ్యాప్తంగా రూ. కోట్లల్లో ఉన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

హైవేపై దోపిడీ

నిద్రిస్తున్నవారిపై రాళ్ల వర్షం

తీవ్రంగా గాయపరిచి.. నగదు దోచుకుని పరారీ

చెన్నేకొత్తపల్లి, జూన్ 21: మండల పరిధిలోని ఎన్‌ఎస్ గేటు వద్ద జాతీయ రహదారిపై దోపిడీ దొంగల ముఠా బీభత్సం సృష్టించింది. వాహన డ్రైవర్లపై రాళ్లు, బీరు బాటిళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. వారి వద్ద ఉన్న రూ.20 వేల నగదును దోచుకువెళ్లింది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుందని రామగిరి సీఐ శివాంజ నేయులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాకు చెందిన డ్రైవర్లు మహేశ్, శ్రీనివాస్, హైదరాబాద్‌కు చెందిన రవి.. హైదరాబాద్‌లోని ఓ షోరూం నుంచి ప్రైవేటు బస్సులను కేరళకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఎన్‌ఎస్ గేటు సమీపంలోని అమర నారాయణస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారి పక్కన వాహనాలను ఆపి నిద్రపోయారు. కర్ణాటకలోని పేరేచంద్రకు చెందిన 407 వ్యాన్ డ్రైవర్లు హెచ్‌ఆర్ శ్రీనివాస్, మనోహర్ హైదరాబాద్‌లో మామిడికాయలను అన్‌లోడ్ చేసి తిరిగి వస్తూ.. అదే ప్రాంతంలో తమ వ్యాన్‌ను ఆపి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో 25 నుంచి 30 ఏళ్ల వయసున్న ముగ్గురు దొంగలు వారిపై రాళ్లు, బీరు బాటిళ్ల వర్షం కురిపించారు. డ్రైవర్లు నిద్ర నుంచి తేరుకునేలోగా తీవ్రంగా గాయపరిచారు. వారి వద్ద ఉన్న రూ.20 వేల నగదు దోచుకుని పారిపోయారు. దొంగల దాడిలో బస్సుల డ్రైవర్లు మహేశ్, శ్రీనివాస్, రవి తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. వ్యాన్ డ్రైవర్లు స్వల్పంగా గాయపడ్డారు. దాడికి పాల్పడిన ముగ్గురు యువకులు ముసుగులు ధరించి ఉన్నారని, హిందీలో మాట్లాడారని బాధితులు తెలిపారు. దాడి చేయవద్దని వేడుకున్నా వినిపించుకోలేదని, తీవ్రంగా కొట్టారని తెలిపారు. వ్యాన్ డ్రైవర్ హెచ్‌ఆర్ శ్రీనివాస్ నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసుకున్నారు. దొంగల ముఠా కోసం గాలిస్తున్నామని తెలిపారు.



అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బస్సు డ్రైవర్లు



దుండగుల దాడిలో ధ్వంసమైన వ్యాన్ అద్దాలు

బస్సులో రక్తపు మరకలు

అంతేనా..!

రూ.కోట్లతో సీడీ ఆస్పత్రి నిర్మాణం



రూ.11కోట్లతో నిర్మించిన సీడీ ఆస్పత్రి ఇదే

- వేధిస్తున్న డాక్టర్లు, సిబ్బంది కొరత
- తలుపులు తెరుచుకోని గైనిక్ విభాగం
- మొత్తం ఆస్పత్రికి ఇద్దరే డాక్టర్లు
- టెక్నీషియన్లు లేక మూలకు చేరిన యంత్రాలు
- మెరుగైన వైద్య సేవల కోసం నగర ప్రజల ఎదురుచూపు

కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన సీడీ ఆస్పత్రిలో ప్రజలకు సరైన వైద్య సేవలు అందకుండా పోతున్నాయి. అప్పటి పాలకులకు భవనాల నిర్మాణం, ప్రారంభంపై ఉన్న శ్రద్ధ సిబ్బంది నియామకంపై లేకపోవడంతో నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందకుండా పోయాయి. మూడు వందల మందికి పైగా ఉండే ఓపీని కేవలం ఇద్దరు వైద్యులే చూడాల్సి వస్తోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది. వచ్చిన యంత్రాలు కూడా టెక్నీషియన్ లేకపోవడంతో మూలకు చేరాయి. ఇలా కోట్లు వెచ్చించి నిర్మించిన ఈ ఆస్పత్రి పరిస్థితి సిబ్బంది కొరతతో అగమ్యగోచరంగా మారింది.



డాక్టర్లు లేక తలుపులు తెరుచుకోని మాతాశిశు విభాగ వార్డు

అనంతపురం టౌన్, జూన్ 21: జిల్లాకేంద్రంలోని పాతూరు కాయగూరల మార్కెట్ సమీపంలో స్థానిక ప్రజలకు వైద్యసేవలు అందించడం కోసం దశాబ్దాల కిందటే సీడీ (చెస్ట్ డిసీజ్) ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ ఆస్పత్రి రాష్ట్ర వైద్య విధాన పరిషత్ పరిధిలో నడుస్తోంది. అయితే ఆస్పత్రి భవనాలు దెబ్బతినడంతో కొత్త భవనాల నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం 2020లో ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.11.02 కోట్ల ఎన్‌హెచ్‌ఎం నిధులను మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడంతో గత ఏడాది సెప్టెంబరు 29న అప్పటి వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే ఇతరప్రజాప్రతినిధులు, కలెక్టరు, వైద్యాధికారులు ఈఆస్పత్రిని ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ ప్రజలకు మాత్రం అనుకున్న మేరకు ఈ ఆస్పత్రి వైద్య సేవలందించడం లేదు.

అందని సేవలు

అన్నిరకాల వైద్యసేవలు అందించాలని సీడీ ఆస్పత్రిని నిర్మించారు. అయితే ఇప్పటికీ పాత ఆస్పత్రిలో మాదిరిగానే ఒకచెస్ట్ డాక్టర్, ఒక ఫిజీషియన్ డాక్టర్ మాత్రమే ఉన్నారు. ప్రతి రోజు కనీసం 350నుంచి 400మందివరకు ఈఆస్పత్రికి రోగులు వస్తున్నట్లు ఓపీ రికార్డులు చెబుతున్నాయి. ఇక్కడకు వచ్చే రోగులకు ఈఇద్దరు డాక్టర్లే ఓపీ పరీక్షలు, అడ్మిషన్ అయినవారికి చికిత్సలు అందించాల్సి వస్తోంది. ఈఆస్పత్రిని ఏర్పాటు చేసేటపుడు ఇక్కడ గైనిక్, మాతాశిశు విభాగం సేవలు, సర్జన్, ఆర్థో, అనస్తీషియా సేవలు అందించడం కోసం నిర్మాణానికి నిధులు కేటాయించారు. కానీ ఇప్పటికీ ఇద్దరు డాక్టర్లు మాత్రమే ఉన్నారు. పెథాలజీ, మైక్రోబయాలజీ డాక్టర్లు ఉన్నా ఫలితం లేకుండా పోయింది. గైనిక్ డాక్టర్లు లేకపోవడంలో ఆవిభాగం తలుపులు ఇప్పటికీ తెరుచుకోలేదు. ఇక ఆపరేషన్ థియేటర్లు దిష్టిబొమ్మలా దర్శనమిస్తూ కనిపిస్తున్నాయి.

స్కానింగ్‌యంత్రం వెనక్కి

ఇంత పెద్ద ఆస్పత్రికి వచ్చే రోగులకు స్కానింగ్ చేయడానికి రూ.లక్షలు వెచ్చించి యంత్రం కొనుగోలు చేసి పంపించారు. ఇక్కడ స్కానింగ్ తీయడానికి రేడియాలజీ టెక్నీషియన్ లేకపోవడంతో ఇప్పటి వరకు ఆ యంత్రంను మూలన పడేసినట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇక ఆయంత్రం వాడకపోతే పాడైపోతుందని భావించిన ఇక్కడి డాక్టర్లు ఆశాఖ ఉన్నతాధికారులకు రేడియాలజీ టెక్నీషియన్‌ను నియమించాలని లేఖ రాశారు. అయినా ఫలితం లేదు. అందుకే ఇక్కడ ఉన్న యంత్రాన్ని మరో ఆస్పత్రికి తీసికెళ్లి వాడుకుంటా మని వైద్యులు లేఖలో పేర్కొన్నారంటే ఈ ఆస్పత్రి నిర్వహణ పట్ల ఉన్నతాధికారులకు ఎంతమేర శ్రద్ధ ఉందో అర్థం అవుతోంది. జిల్లా సర్వజన ఆస్పత్రిలో సరైన వసతులులేక రోగులు అనేక అవస్థలు పడుతున్నారు. కనీసం బాలింతల వార్డును కొంత మేరకు ఇక్కడకు తరలించి డాక్టర్లు, నర్సులు, కొంతమంది సిబ్బందిని ఇక్కడికి నియమిస్తే మంచి వైద్య సేవలందించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కనీసం కలెక్టరైనా ఈఆస్పత్రిపై దృష్టి పెడితే ప్రజలకు మంచి వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని నగర ప్రజలు పేర్కొంటున్నారు.



సీడీ ఆస్పత్రికి వచ్చిన రోగులు

ఆరునెలలుగా స్వీపర్లకు జీతాలు ఇవ్వలేదు

ఈఆస్పత్రిని ప్రతిరోజు శుభ్రం చేయడానికి ఆరుగురు స్వీపర్లను, ముగ్గురు ఎంఎన్‌ఓలను ఏర్పాటు చేసుకున్నారు. వీరందరు ప్రతిరోజు ఆస్పత్రికి వచ్చి అన్ని గదులను శుభ్రం చేస్తున్నారు. ఎంఎన్‌ఓలు రోగులకు అవసరమైన సేవలు అందిస్తూ వస్తున్నారు. కానీ వీరికి ఈఏడాది జనవరి నెల నుంచి ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదని వారు వాపోతున్నారు.



మూతపడిన ఆపరేషన్ థియేటర్

వెనక్కు పంపిస్తున్నాం..



ఈఆస్పత్రికి స్కానింగ్‌యంత్రం వచ్చింది. అయితే స్కానింగ్‌లు తీయడానికి రేడియాలజీ టెక్నీషియన్ లేరు. దీంతో కొన్ని నెలలుగా ఆ యంత్రం వృథాగా పడి ఉంది. మరో వైపు గైనిక్, ఆర్థో, సర్జన్, అనస్థీషియా డాక్టర్లు కూడా లేరు. వారుంటేనే స్కానింగ్ చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. అందుకే అధికారులకు ఈ యంత్రంను పంపిస్తున్నాం.

- డాక్టర్ నవీన్, (సీడీ ఆస్పత్రి ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్)

కలెక్టరు దృష్టికి తీసుకెళ్లాం

సీడీ ఆస్పత్రి వ్యవహారం గురించి ఇప్పటికే కలెక్టరు దృష్టికి తీసికెళ్లాం. ఒకరోజు వచ్చి ఆస్పత్రిని స్వయంగా చూస్తానన్నారు. అతర్వాత కలెక్టరు ఏ సలహాలిస్తే ఆప్రకారం ముందుకు వెళ్తాం. ఇకస్కానింగ్‌యంత్రం వాడకపోతే పాడై పోతుందనే ఇంకో ఆస్పత్రికి తీసికెళ్లి వినియోగిస్తాం. ఇతర డాక్టర్ల నియామక వ్యవహారం నాకు తెలియదు.

- డాక్టర్ రవికుమార్ (డీసీహెచ్‌ఎస్)



కోటంక ఆలయంలో చోరీ

తలుపులు బద్ధలుకొట్టి చొరబడిన దుండగులు.. గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆభరణాలు మాయం

గార్లదిన్నె, జూన్ 21: కోటంక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. తలుపులు పగులగొట్టి రూ.7.80 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణలను ఎత్తుకుపోయారు. గ్రామ సమీపంలోని గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఏటా మాఘమాసంలో నాలుగువారాలు పాటు స్వామివారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రతి ఆదివారం స్వామివారికి పూజా కార్యక్రమాలు జరుగుతాయి. ఇంతటి ప్రఖ్యాత ఆలయంలో చోరీ జరగడం కలకలం రేపింది. ఆలయ ప్రధాన ద్వారాలను ఇనుప రాడ్లతో ధ్వంసం చేసి ఆలయంలోకి ప్రవేశించారు. స్వామివారి గర్భగుడి తలుపులను బద్దలుకొట్టారు. లోపల ఉన్న రెండు బీరువాలను, రెండు హూండీలను పగులగొట్టారు. స్వామివారి బంగారు కిరీటం, నాలుగు శరగోపాలు, స్వామివారి పాదాలు, అమ్మవారి మంగళసూత్రం, వెండి తీర్థంగిన్నె, అష్టలక్ష్మి చెంబు, అయ్యప్ప, వినాయకుడి వెండి గొడుగులు, తీర్థపు చెంబు, ఉత్సవ కిరీటం, స్వామివారి కల్యాణమూర్తి, నాగపడిగలు, వెండి దీపపు స్తంభం, అర్ధ కిరీటం.. ఇలా 19 రకాల బంగారు, వెండి ఆభరణాలను, రూ.5 వేల నగదును ఎత్తుకుపోయారు. ఆలయంలో ఉన్న సీసీ కెమరాలను ధ్వంసం చేసి, హార్డ్ డిస్కులను ఎత్తుకెళ్లారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు శుక్రవారం ఉదయం వెళ్లి చూశాక చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన వెంటనే పోలీసులకు, ఆలయ ఈఓ బాబుకు, గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్ ఆలయానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. దొంగలకోసం గాలిస్తున్నామని ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. కాగా, ఆలయంలో రూ.80 లక్షల విలువైన ఆభరణాల చోరీ జరిగినట్లు వస్తున్న పుకార్లను నమ్మవద్దని, రూ.7 లక్షల విలువైన ఆభరణాలు మాత్రమే చోరీ అయ్యాయని ఈఓ తెలిపారు.



స్వామివారి ఆలయంలో దొంగలు ధ్వంసం చేసిన బీరువా



ఆలయంలో పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్, ఆలయ ఈఓ బాబు

నిర్వహణలో అనంత ఆర్టీసీ ఫస్ట్

అనంతపురం కల్చరల్, జూన్ 21: మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహణలో ఈ ఏడాది అనంతపురం రీజియన్ ఏపీఎస్ ఆర్టీసీ ప్రథమ స్థానం సాధించింది. 2023-24 సంవత్సరానికి గాను మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అన్ని పారామీటర్లలో అధిక కేఎంపీఎల్, బ్రేక్‌డౌన్ రేటు, మెకానికల్ కిలోమీటర్స్ క్యాన్సిలేషన్, స్ప్రింగ్ వాడకం, టైర్ల మైలేజీ, టైర్ల స్క్రాప్‌లలో ఆర్టీసీ యాజమాన్యం నిర్దేశించిన టార్గెట్లను సాధించడంతో అనంతపురం రీజియన్ ఈ ఘనత సాధించింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఎండీ ద్వారకా తిరుమల రావు అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోనికి ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్‌ఎం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్


సవిత


పరిటాల సునీత


కాలవ శ్రీనివాసులు


నందమూరి బాలకృష్ణ


కందికుంట వెంకటప్రసాద్

అనంతను క్లీన్ స్వీప్ చేసిన మేము..

- అసెంబ్లీలో ప్రమాణం చేసిన ఎమ్మెల్యేలు
- ఒకరు బీజేపీ.. 13 మంది టీడీపీ..
- కూటమి శ్రేణుల్లో పట్టరాని ఆనందం



ఉమ్మడి జిల్లాలో క్లీన్ స్వీప్ చేసి.. రికార్డు సృష్టించిన కూటమి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మవరం నుంచి బీజేపీ అభ్యర్థి సత్య కుమార్ యాదవ్, మిగిలిన 13 నియోజక వర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయబావుటా ఎగురవేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి వీరిచేత ప్రమాణ స్వీకారం చేయించారు.

(ఆంధ్రజ్యోతి, అనంతపురం)

మంత్రులతో మొదలు..

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పెనుకొండ ఎమ్మెల్యే సవిత, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌కు మంత్రి పదవులు దక్కాయి. సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే వీరు ముగ్గురు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మూడు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కొనసాగుతున్న పయ్యావుల కేశవ్ ఏడుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి.. ఏకంగా ఐదు సార్లు విజయం సాధించారు. తొలిసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలలో ఆయన మొదట శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మంత్రి సవిత ప్రమాణ స్వీకారం చేశారు. తొలి సారి ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందిన ఆమెకు మంత్రి పదవి వరించింది. సత్యకుమార్ యాదవ్‌కు పొత్తు ధర్మంలో భాగంగా బీజేపీ కోటాలో మంత్రి పదవి లభించింది. ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు.

మాజీ మంత్రులు..

మాజీ మంత్రి పరిటాల సునీత రాప్తాడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికి ఆమె నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. పరిటాల సునీత రాజకీయాల్లోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ ఓటమి ఎరుగరు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు రాయదుర్గం ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. గతంలో ఆయన ఎంపీగా కూడా సేవలు అందించారు. ఎమ్మెల్యేగా మూడుసార్లు పోటీచేసి.. రెండుసార్లు విజయం సాధించారు. మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం గుంతకల్లు ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేశారు.

సీనియర్లు..

హిందూపురం ఎమ్మెల్యేగా నందమూరి బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనలో ఎక్కడా తడబాటు కనిపించలేదు. హిందూపురం నుంచి ఆయన వరుసగా మూడుసార్లు పోటీచేసి హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్నారు. కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా ఒకసారి, టీడీపీ తరుపున నాలుగుసార్లు ఆయన ఎమ్మెల్యేగా పోటీచేశారు. రెండుసార్లు గెలుపొందారు.

తొలిసారి అసెంబ్లీలో..

తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి.. తొలిసారి విజయం సాధించారు. ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ తొలిసారి పోటీచేసి విజయాన్ని అందుకున్నారు. పల్లె సింధూరరెడ్డి ఇంగ్లీషులో, మిగిలిన వారు తెలుగులో ప్రమాణం చేశారు.

పార్టీ కండువాలతో..

అసెంబ్లీలో ఉమ్మడి జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరూ పార్టీ కండువాను వేసుకొనే ప్రమాణం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 14 మంది ఎమ్మెల్యేలు కూటమి పక్షాన గెలిచి ప్రమాణం చేయడం శ్రేణుల్లో ఉత్సాహన్ని నింపింది. ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, ఎమ్మెల్యేల అభిమానులు, బంధువులు టీవీలకు అతుక్కుపోయారు.


అమిలినేని సురేంద్రబాబు


పల్లె సింధూరారెడ్డి


బండారు శ్రావణి


జేసీ అశ్మిత్ రెడ్డి



గుమ్మనూరు జయరాం


దగ్గుపాటి వెంకటేశ్వర్ల ప్రసాద్


ఎంఎస్ రాజు

జనం సొమ్ము జేబులోకి..!

- పిల్లల సొమ్ము, ఎన్నికల నిధులతో డీఎస్‌డీఓ జల్సాలు
- వైసీపీ వీర విధేయుడిగా పేరు
- స్టేడియంలో జనరేటర్, క్రీడాసామగ్రి మాయం
- ప్రశ్నించిన అధికారులకు బెదిరింపులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కోచ్‌లు
- క్రీడాశాఖలో వివాదాస్పదం.. ఆ అధికారి నిర్వాకం



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 21: పిల్లల సొమ్ము, ఎన్నికల నిధులతో ఆ జిల్లాధికారి ఆడుకుంటున్నారు. లక్షల విలువ చేసే సామగ్రిని సైతం తరలిస్తున్నారు. వైసీపీ విధేయుడిగా స్వామిభక్తిని చాటుకుంటున్నారు. పిల్లల ఫీజును కలెక్టర్ పేరు చెప్పుకుని పక్కదారి పట్టిస్తున్నారు. నగరంలోని అశోక్‌నగర్‌లో క్రీడాశాఖకు చెందిన ఇండోర్ స్టేడియంలో ఉన్న రూ.12లక్షల జనరేటర్, 10లక్షల క్రీడాసామగ్రిని మాయం చేశారు. విలువైన జనరేటర్‌ను ఎవరు తీసుకెళ్లారనేది.... క్రీడాశాఖలో చర్చనీయాంశంగా మారింది. గతంలో టీడీపీ హయాంలో జిల్లాకు మంజూరైన ఐదు అకాడమీలకు చెందిన క్రీడా సామగ్రిని ఇండోర్‌స్టేడియంలో భద్రపరిచారు. జనరేటర్‌తోపాటు క్రీడాసామగ్రిని తరలించారనే ప్రచారం ఆశాఖలో జోరుగా సాగుతోంది. ఇదిలా ఉంటే ఎన్నికలకు ముందే జిల్లాకు వచ్చిన డీఎస్‌డీఓ వైసీపీకి అనుకూలంగా ప్రచారం సైతం నిర్వహించి స్వామి భక్తిని చాటుకున్నారు. అంతేగాక తన సామాజికవర్గంలో వైసీపీ పట్ల అపారమైన ప్రేమ కురిపిస్తుండడం గమనార్హం. ఎన్నికల్లో జేఎన్‌టీయూలో ట్రాఫిక్ నియంత్రణకు నియమించిన కోచ్‌లు, క్రీడాకారుల పారితోషికం రూ.3లక్షలు మాయం చేసినట్లు చెబుతున్నారు. కోచ్‌లకు ఒక్కొక్కరికి రూ.2వేలు మాత్రమే చెల్లించి మిగిలిన సొమ్మును క్రీడాకారులకు ఇవ్వకుండా డీఎస్‌డీఓ తన జేబులో వేసుకున్నట్లు చర్చించుకుంటున్నారు. సొమ్మొకరిది...సోకు మరొకరిది అన్న చందంగా పిల్లల ఫీజులు, ఎన్నికల విధుల పారితోషికం నిధులతో డీఎస్‌డీఓ జల్సా చేస్తున్నారనే ప్రచారం ఆశాఖలో జోరుగా సాగుతోంది. డీఎస్‌డీఓ చేస్తున్న అవినీతి అక్రమాలకు సిబ్బంది సహకరిస్తుండగా... కోచ్‌లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ....అసంతృప్తి వ్యక్తం చేస్తూవస్తున్నారు. తమకు ఇటువంటి డీఎస్‌డీఓ వద్దు... అంటూ మొరపెట్టుకుంటున్నారు.


అశోకనగర్ ఇండోర్‌స్టేడియం

జనరేటర్, సామగ్రి మాయం

ఇండోర్ స్టేడియంలో రూ.12క్షల జనరేటర్, రూ.10లక్షల క్రీడాసామగ్రి మాయమైంది. దీనిపై ఎవరూ స్పందించడం లేదు. జనరేటర్, క్రీడాసామగ్రి అమ్ముకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం మొత్తం డీఎస్‌డీఓ ఆధీనంలోనే ఉంటుంది. అయితే జనరేటర్, క్రీడాసామగ్రి అదృశ్యం కావడంపై మాత్రం ఎవరూ నోరుమెదపడం లేదు. ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు నీటి వసతి, మరుగుదొడ్ల కొరత ఉన్నప్పటికీ...వాటిపై స్పందించే నాథుడే కరువయ్యారు.


జనరేటర్ రూం

విచ్చలవిడిగా ఖర్చు

పిల్లలు చెల్లించిన ఫీజు సొమ్ముతో విచ్చలవిడిగా ఇండోర్‌స్టేడియంలో ఖర్చు చేస్తున్నారు. వైసీపీకి అత్యంత ప్రీతిపాత్రుడైన డీఎస్‌డీఓ ఆది నుంచి వివాదాస్పదమవుతున్నారు. దీంతో కోచ్‌లు, డీఎస్‌డీఓ మధ్య అనేకమార్లు వాగ్వాదాలు తలెత్తాయి. వైసీపీకి అనుకూలంగా క్రీడాశాఖలో ఎన్నికల ముందు ప్రచారం సైతం నిర్వహించారంటే...ఆ డీఎస్‌డీఓకు స్వామిభక్తి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఎవరైనా కోచ్‌లు, ఇతర సందర్శకులు స్టేడియంలోని కార్యాలయానికి వస్తే...కలెక్టర్ పేరు చెప్పి తన సామాజిక వర్గంతో సొంత పనులు చేసుకుంటున్నారనే ప్రచారం ఆశాఖలో జోరుగా సాగుతోంది. ఇండోర్ స్టేడియంలోని ఓ గదిలో పాగా వేసిన డీఎస్‌డీఓ... ఓ మతప్రచార కార్యాలయంగా మార్చేశారు. ఇదిలా ఉంటే కలెక్టర్ పేరుతో ఇప్పటి వరకు పిల్లల సొమ్ము సుమారు రూ.10లక్షలు అభివృద్ధి మాటున నిధులు కాజేశారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు సంబంధించిన సుమారు రూ.5లక్షల నిధులు ఎక్కడికి వెళ్లాయో లెక్కలు లేకుండా పోయాయి.

పిల్లల సొమ్ముతోనే అన్ని పనులు చేస్తున్నారు

- మేఘ స్వరూప్, నగరపాలక కమిషనర్

మున్సిపాలిటీ నిధులతో పనులు చేస్తున్నామని.... డీఎస్‌డీఓ ప్రచారం చేస్తుండగా...ఇదే విషయాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ మాత్రం అంగీకరించలేదు. మున్సిపాలిటీ నుంచి నగరంలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో నెట్ ప్రాక్టీస్ మ్యాట్లు (మినీస్టేడియం) ఏర్పాటు చేస్తున్నామని... డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియానికి ఎటువంటి నిధులు చెల్లించలేదని... అదంతా పిల్లల ఫీజుల నుంచి వచ్చిన సొమ్ముతోనే పనులు చేస్తున్నారని చెప్పుకొచ్చారు.

సహకరిస్తున్న సిబ్బంది..!

జిల్లా క్రీడాశాఖలో నాలుగు నెలలుగా డీఎస్‌డీఓ వ్యవహరిస్తున్న చిత్రమైన తీరుతో కోచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే కోచ్‌లు బహిరంగంగా ప్రశ్నిస్తే ఇక వారి పరిస్థితి అంతే. కలెక్టర్‌కు పిర్యాదు చేస్తానంటూ...బెదిరింపులకు దిగుతున్నారు. పోలింగ్ రోజు, కౌంటింగ్‌రోజున జేఎన్‌టీయూలో సుమారు వంద మంది క్రీడాకారులను ట్రాఫిక్ నియంత్రణ విధులకు నియమించారు. ఇందులో కోచ్‌లూ ఉన్నారు. కోచ్‌లకు మాత్రం ఎన్నికల విధులకు సంబంధించిన పారితోషికంగా నామమాత్రంగా ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున చెల్లించారు. క్రీడాకారులు వందమందికి మాత్రం పారితోషికం ఇవ్వకపోగా...విధుల్లో కనీసం మంచినీరు, భోజనవసతి కల్పించకపోవడం గమనార్హం. ప్రభుత్వం మాత్రం సుమారు రూ.3లక్షలు వరకు చెల్లించినట్లు సమాచారం. అయితే ఈ నిధులన్నీ ఎక్కడికి వెళ్లాయో...మరి ఆ డీఎస్‌డీఓనే చెప్పాలి.


ప్రకృతి వ్యవసాయ అధికారులతో జాంబియా బృందం

ముగిసిన జాంబియా బృందం పర్యటన

అనంతపురం అర్బన్, జూన్ 21: ఉమ్మడి అనంత జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు వచ్చిన జాంబియా బృందం పర్యటన శుక్రవారంతో ముగిసింది. ఈనెల 8 వతేదీ నుంచి 20వతేదీ దాకా ఉమ్మడి జిల్లాలోని తాడిపత్రి, బత్తలపల్లి, పరిగి మండలాల్లోని పలు గ్రామాల్లో జాంబియా దేశానికి చెందిన 16 మంది బృందం సభ్యులు పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసే పంటల విధానాన్ని పరిశీలించారు. ఘన, ద్రవజీవామృతం తయారుచేసే విధానాన్ని తెలుసుకున్నారు. విత్తన సమయంలో విత్తన శుద్ధి చేసే తీరు, సాగులో పలు దశల్లో పాటించాల్సిన పద్ధతులను తెలుసుకున్నారు. పర్యటన ముగియడంతో తిరిగి జాంబియాకు బయలుదేరి వెళ్లారు.

కన్నుమూస్తూ.. ఇద్దరికి చూపు..

నార్పల, జూన్21: మండలంలోని బొందలవాడ గ్రామానికి చెందిన దుగ్గిమి చంద్రమౌళి విద్యుదాఘాతంతో మృతిచెందిన విషయం తెలిసిందే. చనిపోతూ మరో ఇద్దరు జీవితాల్లో వెలుగు నింపి, ఆదర్శ ప్రాయుడయ్యారు. తన కళ్లని ఎల్‌వీ కంటి ఆసుపత్రికి దానం చేశారు. కుటుంబ సభ్యుల ఆమోదం మేరకు కళ్లని దానం చేశారని గ్రామస్థులు తెలిపారు.


ప్రశంసాపత్రం అందజేస్తూ..

టీడీపీ మహిళా కార్యకర్తపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి, జూన్ 21: మండలంలోని బసినేపల్లి గ్రామంలో టీడీపీ మహిళా కార్యకర్త జ్యోతిపై వైసీపీకి చెందిన మహిళలు శుక్రవారం దాడి చేశారు. బాధితురాలు జ్యోతి తెలిపిన వివరాల మేరకు....పిల్లలను స్కూల్‌లో వదిలి ఇంటికి వెళ్తుండగా వైసీపీకి చెందిన ఐదుగురు మహిళలు ఉన్నఫళంగా దాడి చేశారు. నానా దుర్భాషలాడుతూ ఆమెను చుట్టు ముట్టి కింద పడేసి విచక్షణా రహితంగా కాళ్లతో తొక్కారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. 'మీ పార్టీ అధికారంలో ఉందనుకుంటున్నావేమో నీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగారు. అడ్డుకోబోయిన వారిపై కూడా తిరగబడ్డారని తమకు న్యాయం చేయాలని ఆమె పోలీసులను వేడుకుంది. కేవలం ఉద్దేశపూర్వకంగానే తనపై దాడి చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. టీడీపీ నాయకుడు భర్త గురుప్రసాద్, పార్టీశ్రేణులతో కలిసి పోలీసులకు పిర్యాదు చేసింది. ఎన్నికల సమయంలో నాగసముద్రం, బసినేపల్లి గ్రామాల్లో టీడీపీ వారిపై వైసీపీ నాయకులు దాడి చేసినసందర్భంలో తాము పిర్యాదు చేసినప్పుడే పోలీసులు చర్యలు తీసుకుని ఉంటే ప్రస్తుతం ఇలాంటి దాడి సంఘటనలు జరిగేవి కావని పలువురు టీడీపీ మండల నాయకులు వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు దాడులకు పాల్పడిన వైసీపీ శ్రేణులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.


గాయపడిన జ్యోతి

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురంరూరల్, జూన్ 21: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 961 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, జూన్21 : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం న్యాయసేవాసదన్‌లో శాశ్వత లోక్‌అదాలత్‌లో ప్రజాప్రయోజన కేసుల పరిష్కారానికై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ప్రజా ప్రయోజన శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్, న్యాయాధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఎన్నో ఏళ్ల కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎలాంటి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రూ.కోటి పరిహారం వరకు వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం వుందన్నారు. లోక్‌అదాలత్ శాశ్వత సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన న్యాయ సహాయ ప్రతివాద న్యాయవాది ఇటికె నల్లప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్


యోగాసనాలు వేస్తున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్లు, మెడికోలు


యోగా గురువును సన్మానిస్తున్న జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు


కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా కళాశాలలో...

ఉల్లాసంగా.. ఉత్సాహంగా... యోగా

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: యోగా దినోత్సవాన్ని నగరం, మండల కేంద్రాల్లో శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. డ్వామా వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో ముద్దలాపురం సమీపంలోని అమృత్ సరోవర్ ప్రాజెక్ట్ పరిధిలోని పొలాల్లో డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు యోగా చేశారు. అనంతపురంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జేఎన్‌టీయూలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ శ్రీనివాసరావు యోగా గురువు మల్లికార్జునను సన్మానించారు. అదే విధంగా సెంట్రల్ యూనివర్సిటీ, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో యోగా డేని నిర్వహించారు. జిల్లావైద్యకళాశాల ఆడిటోరియంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైద్యులు, మెడికోలు యోగాసనాలు చేశారు.

అనంతపురంరూరల్ మండలంలోని కొడిమి సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో, ఆలమూరు సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలలో, అనంతపురం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా గాయత్రి కమర్షియల్ కాంప్లెక్స్‌లో, సాయినగర్‌లోని సాయివృత్తి శిక్షణా కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రసన్నాయపల్లి చెరువు శివార్లలో ఉపాధి హామీ కూలీలతో కలిసి డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు యోగా చేశారు. చెన్నేకొత్తపల్లి, రామగిరిలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.


యోగా విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్


అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో...


శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలలో..


అనంతపురంలో యోగా గురువు బాబూరావుకు సన్మానం


ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

ఆస్పత్రి వద్ద టీడీపీ శ్రేణుల అన్నదానం

అనంతపురం టౌన్, జూన్ 21: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడం.. అనంత అర్బన్ ఎమ్మెల్యేగా దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంపై టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద టీడీపీ నాయకులు ఓం కార్‌రెడ్డి, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నాయకులు పేదలు, రోగులకు అన్నదానం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు అసెంబ్లీలో తిరిగి అడుగుపెట్టి శపథం నెరవేర్చుకోవడం ఆనందాన్ని ఇస్తోందని వారు పేర్కొన్నారు. తొలిసారిగా పోటీ చేసి అనంత ప్రజల ఆదరాభిమానాలతో ఎమ్మెల్యేగా దగ్గుపాటి గెలుపొందడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగారెడ్డి, సురేష్, చేపల హరి, కృష్ణం రఘు, నరేష్, ఇబ్రహీం, ఆది, బ్రహ్మ, విజయ్‌కుమార్, ప్రిన్స్ రఘు, మహేష్, విజయ్ పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్ 21: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్‌ను కలిసి అభినందనలు తెలిపినట్లు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం అమరావతిలో అసెంబ్లీ కార్యాలయంలో వారిని కలిసినట్లు తెలిపారు. కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా తాను అందరని సమన్వయం చేసుకుని పార్టీని గెలిపించడంపై సీఎం చంద్రబాబు తనను ప్రశంసించినట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో అన్ని నియోజకవర్గాల కంటే కోడుమూరులోనే పార్టీ అత్యధిక మెజార్టీ సాధించినట్లు తాను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.


నారాలోకేష్‌తో రామలింగారెడ్డి

మిర్చి విక్రయాలు ప్రారంభం

అనంతపురంరూరల్: స్థానిక రైతు బజారులో పచ్చిమిర్చి కేజీ రూ. 42లకే విక్రయాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఈ విక్రయాలను ప్రారంభించారు. మొదటిరోజు రెండున్నర క్వింటాళ్లు విక్రయించినట్లు రైతు బజారు ఇన్‌చార్జ్ ప్రతాప్ రుద్ర తెలిపారు.

అంతర్జాతీయ క్రీడా పోటీలకు రాధిక

అనంతపురం క్లాక్‌టవర్: అంతర్జాతీయ లాక్రోస్ క్రీడా పోటీలకు జిల్లాకు చెందిన రాధిక ఎంపికైంది. జులై 1 నుంచి 4వ తేదీ వరకు ఉజ్బెకిస్థాన్‌లో నిర్వహించే ఏసియన్ లాక్రోస్ గేమ్స్ ఉమెన్స్- 2024 చాంపియన్‌షిప్ పోటీల్లో రాధిక భారతదేశం తరఫున ప్రాతినిథ్యం వహించనుంది. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ వినోద్ కుమార్ రాధికను అభినందించారు.



నేడు సంధ్యారవళి నృత్యోత్సవం

అనంతపురం కల్చరల్ : శ్రీ నృత్యకళానిలయం ఆధ్వర్యంలో శనివారం స్థానిక టీటీడీ కల్యాణమండపంలో సంధ్యారవళి జాతీయస్థాయి నృత్యోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ నృత్యకళానిలయం ఆధ్వర్యంలో ఏటా జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల నృత్యకళాకారులతో నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే శనివారం టీటీడీ కల్యాణమండపంలో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు శాస్త్రీయ నృత్యప్రదర్శనలు నిర్వహిస్తామని, ప్రదర్శనానంతరం కళాకారులను జ్ఞాపికలతో సత్కరిస్తామని తెలిపారు. నృత్యోత్సవానికి కళాకారులు, కళాభిమానులు విరివిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

అనంతపురం ప్రెస్‌క్లబ్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే (బీసీ గురుకులాల) పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6, 7, 8, 9 తరగతుల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆ గురుకులా జిల్లా కన్వీనర్ సంగీతకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నార్పలలో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ కేంద్రాన్ని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ పరిశీలించారు. మొత్తం 63 సీట్లకుగాను 1301 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా... 957 మంది పరీక్షలకు హాజరయ్యారు.

రెండు పోస్టులు భర్తీ

అనంతపురం విద్య: సమగ్రశిక్ష ప్రాజక్టు పరిధిలో రెండు ఫిజియో థెరపిస్టు పోస్టులను భర్తీ చేశారు. ఆ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం టీవీటవర్ వద్దగన్న సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏడుగురు దరఖాస్తు చేయగా ఆరుగురు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపిక కమిటీ కన్వీనర్, సమగ్రశిక్ష ప్రాజక్టు ఏపీసీ వైఖోమ్ నిదియా దేవి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ, డీఎంహెచ్‌ఓ కార్యాలయం, జీజీహెచ్ సిబ్బంది ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. ఇద్దరిని ఎంపిక చేసినట్లు సమగ్రశిక్ష ప్రాజక్టు అధికారులు తెలిపారు.

విత్తన దుకాణాల తనిఖీ

గార్లదిన్నె : మండలంలోని గార్లదిన్నె, కల్లూరు గ్రామాల్లోని విత్త న దుకాణాలను విజిలెన్స్ ఏఓ వాసుప్రకాష్, ఎస్‌ఐ వణీంద్రరెడ్డి, స్థానిక ఏఓ సోమశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. న్యూ నందిని, న్యూ అమృత దుకాణాలలో వరి విత్తనాల నిల్వలకు సంబంధించి రికార్డులు, స్టాక్ నిల్వలు సక్రమంగా లేకపోవడంతో 1983 చట్ట ప్రకారం రూ. 1,08,000 విలువైన స్టాక్‌ను విక్రయించకుండా దుకాణాదారులకు నోటీసులిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నార్పల: మండలంలోని నిలువురాయి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ భారతి శుక్రవారం తనిఖీచేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది పనితీరు, టీహెచ్‌ఆర్ పంపిణీ వివరాలను లబ్ధిదారులను అడిగితెలుసుకున్నారు. గర్భవతులకు టీహెచ్‌ఆర్ పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలకు వెళ్లే పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లులతో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునాలని, సిబ్బంది పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి

చెన్నేకొత్తపల్లి : గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని ఎంఈఓ-1, ఎంఈఓ-2 మున్వర్‌బాషా, ప్రసూన్ కుమార్ నాయుడు పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలో శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నతపాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబుళమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

శింగనమల: మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మలేరియాపై అవగాహన ర్యాలీని శింగనమలలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో మెడికల్ ఆఫీసర్ శంకర్‌నాయక్, ఎంఈఓ నరసింహరాజు సీహెచ్‌ఓ గంగాధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: మలేరియాపై అవగాహన కల్పిస్తూ రాప్తాడులో అధికారులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో వైద్యాధికారి శివకృష్ణ, ఎంపీడీఓ గీతావాణి, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఎంఈఓ మల్లికార్జున, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 21: జిల్లాలోని ఆర్బీకేల్లో 23వ రోజైన శుక్రవారం విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 80,987 మంది రైతులకు 73,068 క్వింటాళ్లు పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా 83,823 మంది రైతులు 73,971 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

అనంతపురం రూరల్, జూన్ 21: మండలంలోని కందుకూరులో ఏరువాక పౌర్ణమిని శుక్రవారం నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ... రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవాత్మకంగా చట్టాలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా నాయకులు వెంకటరాముడు, బుల్లె నగేష్, పుల్లారెడ్డి, శ్రీరాములు, నల్లప్ప, ఓబులేసు, రామాంజినేయులు పాల్గొన్నారు.

శింగనమల : మండలంలోని కల్లుమడిలో ఏరువాక వ్యవసాయ పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ పనులను రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షుడు ముధుయాదవ్ రైతు సంఘం నాయకులు కొడపల్లి చంద్రశేఖర్ రామసూబ్బారెడ్డి నేసే మధు రైతులు పాల్గొన్నారు.


కందుకూరులో ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్న నాయకులు


ఆలయంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు

కనకదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యేలు

అనంతపురం అర్బన్, జూన్ 21: అసెంబ్లీలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత శుక్రవారం సాయంత్రం విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారిని తన కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

భవనం మరమ్మతులకు ప్రతిపాదనలు


శింగనమల, జూన్ 21: శింగనమల ఎమ్మార్సీ భవనం మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు సమగ్ర శిక్ష అధికారులు తెలిపారు. ఎమ్మార్సీ భవనం నిర్వహణలేక శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై గురువారం ఆంధ్రజ్యోతిలో ఓ కథనాన్ని ప్రచురించడంతో స్పందించిన సమగ్ర శిక్ష శాఖ ఈఈ శంకరయ్య, డీఈ జయరాములు, ఏఈ చిన్నవెంకటేశ్, ఎంఈఓ నరసింహరాజు ఆ భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. భవనం మరమ్మతులకు అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

నీట్ రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్

అనంతపురం విద్య, జూన్ 21: పేపర్ లీక్‌తో అనేక విమర్శలు ఎదుర్కొంటున్న నీట్ పరీక్షలను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చొని ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి మాట్లాడుతూ... నీట్ పరీక్షల్లో పేపర్ లీక్ అయితే రద్దు చేశారని, నీట్ పరీక్షల్లో పేపర్ లీక్ అయితే ఎందుకు రద్దు చేయరని ప్రశ్నించారు. ఈ లీకేజీ వల్ల లక్షలాది మంది మెడికల్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపిందన్నారు. వెంటనే నీట్ పరీక్షలను రద్దుచేయాలని, సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయించాలని కోరారు. అదేవిధంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నగర అధ్యక్షులు మంజునాథ్, కార్యదర్శులు ఉమామహేష్, ఇతర నాయకులు వంశీ, హరికృష్ణ, సమీర్, ఆనంద్, హర్ష పాల్గొన్నారు.

చిన్నారి ఆచూకీ కనుక్కుంటాం: ఎస్పీ

నార్పల, జూన్ 21: స్థానిక కొత్త బస్టాండ్ కాలనీకి చెందిన చిన్నారి పావని అదృశ్యమైన విషయమైన తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎస్పీ గౌతమి శాలి గురువారం అర్ధరాత్రి నార్పల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. చిన్నారి పావని ఆచూకీ త్వరలో కనుక్కుంటామని, ఎలాంటి భయాందోళన చెందవద్దని పావని తల్లిని ఓదార్చారు. కేసును త్వరగా ఛేదించాలని డీఎస్పీ, సీఐలకు ఆదేశించారు.



మహిళపై దాడిచేసిన వారిని శిక్షించాలి

అనంతపురం సెంట్రల్, జూన్ 21: దళిత మహిళ నాగలక్ష్మిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతున్న నాగలక్ష్మిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ... కళ్యాణదుర్గం మండలం బాలవెంకటాపురం గ్రామానికి చెందిన నాగలక్ష్మికి 1996లో అప్పటి ప్రభుత్వం ఐదుఎకరాల వ్యవసాయ భూమిని డి పట్టాగా మంజూరుచేసిందన్నారు. ఆ పొలాన్ని ఆక్రమించుకోవడానికి అదే గ్రామానికి చెందిన గోపాల్ నాగలక్ష్మిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో గోపాల్ మరిన్ని దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఓబులేసు, శ్రీరాములు, నల్లప్ప పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయండి

అనంతపురం టౌన్, జూన్ 21: జిల్లాలో గర్భస్థ లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వైద్యాధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లింగనిర్ధారణ చట్టం అమలుపై జిల్లాస్థాయి కమిటీతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ... జిల్లాలో ప్రతి స్కానింగ్ సెంటర్ లింగనిర్ధారణ చట్టానికి లోబడి పనిచేయాలన్నారు. ఎవరైనా విరుద్ధంగా వ్యవహరిస్తే ఆ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులతో పాటు అందుకు కారకులైన వైద్యులు, సిబ్బందిపై యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని గట్టిగా ఆదేశించారు. ఈ చట్టంపై స్కానింగ్ సెంటర్లకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లు, సినిమాహాల్స్, ఇతర పబ్లిక్ ప్రాంతాల్లో పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. మాతాశిశుమరణాలపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బి.దేవి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ శిరప్ప, డెమోలు ఉమాపతి, త్యాగరాజు, గంగాదర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు

అనంతపురం కల్చరల్, జూన్ 21: జ్యేష్ట శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బెంగుళూరు రోడ్డులోని శివకోటి దేవాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన వ్రత మంటపంలో సత్యనారాయణస్వామిని విశేషం గా అలంకరించి.. వ్రతాలను నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.


శివకోటి దేవాలయంలో వ్రతం నిర్వహిస్తున్న పండితులు

రామగిరిలో సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

రామగిరి, జూన్ 21: రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో రామగిరిలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, రామ్మూర్తి నాయుడు, మాజీ ఎంపీపీ పరందామయాదవ్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, పోలేపల్లి చంద్రప్ప, మాజీ సర్పంచ్ పేపర్‌శీన, పేరూరు మల్లికార్జున, చంద్రాయుడు, పోతన్న, ఎంపీటీసీ శ్రీనివాసులు, అక్కులప్ప పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జూన్ 21: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి మండిపడ్డారు. శుక్రవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ... అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశాడని, వాటిని తిరిగి గాడిలో పెట్టడానికి కూటమి పాలకులకు చాలా కృషి చేయాల్సి ఉందని అన్నారు. టీడీపీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీ, ధనుంజయ, వెంకటేష్ పాల్గొన్నారు.

రష్యా సదస్సుకు మేయర్


సదస్సులో పాల్గొన్న మేయర్

అనంతపురం క్రైం, జూన్ 21: రష్యా దేశంలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల మేయర్ల సమావేశంలో నగర మేయర్ మహమ్మద్ వసీం పాల్గొన్నారు. బ్రిక్స్ మేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ సమావేశానికి అనంతపురం మేయర్‌కు ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అనంతపురం నగర చరిత్ర, పెనుకొండ, లేపాక్షి ఆలయాలకు సంబంధించిన పుస్తకాన్ని అందజేయగా, బ్రిక్స్ లైబ్రరీలో ఉంచుతామని అక్కడి ప్రతినిధులు చెప్పినట్లు మేయర్ తెలిపారు. అనంతపురం నగరానికి ఉన్న వారసత్వ సంపద వల్ల అంతర్జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు దక్కడం గర్వంగా ఉందన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

శింగనమల జూన్ 21: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని ఎంపీడీవో బి.వెంకటరమణ, ఎంఈఓ నరసింహరాజు శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠశాలల్లో మెను ప్రకారం భోజనం పెట్టాలని, లేకుంటే ఏజెన్సీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంహెచ్‌ఓ వర్సెస్ వర్కర్స్ యూనియన్

నగరపాలికలో పెరుగుతున్న విభేదాలు

అనంతపురం క్రైం, జూన్ 21: అనంతపురం నగరపాలిక ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకుల మధ్య వైరం పెరుగుతోంది. కార్పొరేషన్‌కు విష్ణుమూర్తి ఎన్నికలకు ముందు ఎంహెచ్‌ఓగా వచ్చారు. వచ్చిన కొంతకాలానికే మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కు, ఎంహెచ్‌ఓకు మధ్య విభేదాలు తలెత్తాయి. మూడు రోజులుగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంహెచ్‌ఓపై ఆరోపణలు గుప్పిస్తున్నారు. మహిళా కార్మికులను అసభ్యంగా మాట్లాడుతున్నారని, కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. శుక్రవారం ఏకంగా కులవివక్ష పోరాట సంఘంతో కలిసి డీఎంహెచ్‌ఓ ఈబీ దేవిని కలిసి ఎంహెచ్‌ఓపై ఆరోపణలు చేసి, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌కూ వినతిపత్రం అందజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అయినా ఈ సమస్య పరిష్కరించడంలో అటు పాలకవర్గం, ఇటు ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆ సంఘం నాయకులు మండిపడుతున్నారు.



ఇలా మొదలైంది...

ప్రస్తుత పాలకవర్గం ఏర్పడిన మొదట్లో మేస్త్రీలుగా ఉన్న వర్కర్లందరూ నడుం వంచాల్సిందేనన్న ఆదేశాలొచ్చాయి. కొన్ని నెలల క్రితం తిరిగి వర్కర్లనే మేస్త్రీలుగా నియమించారు. ఎన్నికల ముందు వచ్చిన ఎంహెచ్‌ఓ ఈ విధానాన్ని వ్యతిరేకించారు. నగరపాలిక పరిధిలోని మేస్త్రీలు కూడా కార్మికుల పనిచేయాలంటూ ఎంహెచ్‌ఓ ఆదేశించడమే యూనియన్‌తో విభేదాలకు కారణమైనట్లు సమాచారం. ఎంహెచ్‌ఓ పారిశుధ్యంపై సరిగా దృష్టి సారించడం లేదని, సాయంత్రమే తాడిపత్రికి వెళ్లిపోతున్నారని విమర్శలున్నాయి.


కూడేరు పాఠశాలలో యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


బేతాపల్లి ఆరోగ్య కేంద్రంలో యోగా చేస్తున్న వైద్య సిబ్బంది(గుత్తిరూరల్)


గుత్తి: కోర్టు ప్రాంగణంలో యోగాసనలు వేస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు


గుంతకల్లు: రైల్వే గ్రౌండులో యోగాభ్యాస కార్యక్రమంలో డీఆర్ఎం వినీత్ సింగ్


పామిడిలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న యోగా శిక్షకులు


తాడిపత్రి టౌన్:ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రశాంత యోగం

మానసిక ప్రశాంతత యోగాతోనే సాధ్యమని పలువురు యోగా గురువులు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలు ప్రాంతాల్లో ఉదయాన్నే యోగా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాలయాల్లో విద్యార్థులు, అధ్యాపకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఉద్యోగులు, వివిధ పట్టణాల్లో ఉన్న యోగా సెంటర్లలో శిక్షకులు యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, యోగా శిక్షకులు మాట్లాడుతూ రోజూ యోగా చేయడం వల్ల మనిషికి ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయని వివరించారు. యోగా సాధన వల్ల జీవితంలో అనేక మార్పులు రావడమే కాక మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. రోజూ ఉదయమే యోగాసనాలు చేయడం వల్ల బీపీ, షుగర్ వంటి రోగాలు దూరం అవుతాయన్నారు.

-ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు(కళ్యాణదుర్గం రూరల్)


కుందుర్పి ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ, ఎంఈఓ


రాయదుర్గం రూరల్: డిగ్రీ కళాశాలలో యోగా చేస్తున్న లెక్చరర్లు, విద్యార్థులు


కణేకల్లు మండలం బ్రహ్మసముద్రంలో యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

ప్రజాసంక్షేమమే ప్రథమ కర్తవ్యం


డ్రైడే గురించి మాట్లాడుతున్న కలెక్టర్

కణేకల్లు, జూన్ 21: ప్రజల సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కణేకల్లులోని పలు కాలనీలలో ఆయన డ్రైడేను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారంలో ఒక రోజు డ్రైడేను పాటించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 21: మండలంలోని ఉప్పొంక గ్రామంలో బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు ధనుష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ కేసు కళ్యాణదుర్గం ప్రాంతంలో సంచలనంగా మారింది.

కేజీబీవీ తనిఖీ


భోజన మెనూను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ

డీ.హీరేహాళ్, జూన్ 21: మండల కేంద్రంలోని కేజీబీవీని జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, భోజనం మెనూకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ రఘునాథ్, ఏఈ హరికృష్ణనాయక్, సూపరింటెండెంట్ బలరాంతక్ష కలిసి నాడు నేడు పథకం కింద ఆగిపోయిన పాఠశాల భవనాలను పరిశీలించారు.

వసతి గృహంలో మరమ్మతులు చేపట్టాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

● జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

కళ్యాణదుర్గం, జూన్ 21: శెట్టూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, వాటర్ ట్యాప్‌ల వంటి వాటి మరమ్మతులు వెంటనే చేపట్టాన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మళ్లీ ఈ నెల 25 లోపు హాస్టల్ తనిఖీ చేస్తానని అంతలోపు పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం హాస్టల్‌లోని స్టోర్‌రూమ్, కిచెన్ సెక్షన్, గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గదుల కిటికీలకు మెష్‌లను నిర్మించి దోమల బెడద లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్, తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈలు, హాస్టల్ వార్డెన్, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు


టీ సర్కిల్లో సంబరాలు జరుపుకుంటున్న తెలుగు యువత నాయకులు, టీడీపీ కార్యకర్తలు


ఎన్టీఆర్ భవన్ వద్ద సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు


టీడీపీ జెండాలు చేతబట్టి సంబరాలు చేసుకుంటున్న తెలుగు యువత నాయకులు

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 21: కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా అమిలినేని సురేంద్ర బాబు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలోని టీ సర్కిల్లో సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే అమిలినేని ఫ్లెక్సీలకు టీడీపీ యువ నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పంచిపెట్టి టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండాపురం అనిల్ చౌదరి, యువ నాయకులు పవన్ యాదవ్, ప్రకాష్, బసంపల్లి నవీన్‌చౌదరి, రాజేష్ బాబు, వాల్మీకి నరసింహ రాజు, అనిల్ యాదవ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ నిర్వహణ తీరు మెరుగుపడాలి

గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

యాడికి, జూన్21: కేజీబీవీ నిర్వహణ తీరు మెరుగుపడాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వేములపాడు వద్ద ఉన్న కేజీబీవీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కేజీబీవీలో రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల నిర్వహణ, హాస్టల్ నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో కరెంట్ సౌకర్యాలపై వివరాలను ఆరాతీశారు. లైబ్రరీ, లేబొరేటరీ నిర్వహణ, భోజన వసతిలను పరిశీలించారు. కూరగాయలు నాణ్యమైనవి వాడాలని ఆదేశించారు. పాఠశాల వద్ద డ్రైనేజీ నిర్వహణపై ఎస్‌ఓ నిర్మలతో వివరాలు ఆరాతీశారు. విద్యార్థులతో సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలమేరకు కేజీబీవీని తనిఖీ చేసినట్లు తెలిపారు. పాఠశాల నుంచి వెళ్లే డ్రైనేజీ సమస్యగా ఉందని తెలిపారు. మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ కాశప్ప, తహసీల్దార్ మోహనవల్లి, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ ఉన్నారు.


వంట తయారీ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ

మంత్రులను కలిసిన జితేంద్రగౌడ్


హోంమంత్రి అనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జితేంద్రగౌడ్

గుంతకల్లు టౌన్,జూన్21: రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలను చేపట్టిన వంగలపూడి అనిత, రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో మంత్రుల కార్యాలయాలలో శుక్రవారం రాష్ట్ర హోం మంత్రి వంగల పూడి అనిత, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మార్యదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పాగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రి కొల్లు రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జితేంద్రగౌడ్

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 21: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయ సేవాధికారి సంస్థ ఛైర్మన్ బండే సుభాన్ తెలిపారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాల పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న నిర్వహించే లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండ్ కేసులు, సివిల్ కేసులు, ఎస్ఐ యాక్ట్ కేసులు, మెయింటెనెన్స్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరమయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పట్టణ సీఐ హరినాథ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీఎన్‌టీయూసీ నాయకుడు

కూడేరు, జూన్ 21: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో కలిసినట్లు టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రోలర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అందించి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో కురుబ సామాజిక వర్గానికి చెందిన సవితకు స్థానం కల్పించడం హర్షనీయమన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలో పలువురు మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసి పుష్పగుచ్ఛాలు అందించినట్లు వెల్లడించారు.


బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగరాజు

జుంజురంపల్లిలో కందుల పంపిణీ

రాయదుర్గం రూరల్, జూన్ 21: మండలంలోని జుంజురంపల్లి గ్రామంలో రైతులకు కందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాయ సహాయ అధికారి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలోని ఆర్బీకే కార్యాలయంలో సర్పంచ్ వన్నూరుస్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న కందులను రైతులకు అందించారు. ప్రభుత్వం రైతులకు జుంజురంపల్లి ఆర్బీకే కేంద్రానికి నాలుగు క్వింటాల కందులను కేటాయించిందన్నారు. అందులో భాగంగా గ్రామంలోని 60 మంది రైతులు కందుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా 60 మందికి కందుల విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లచ్చన్నచౌదరి, వీరస్వామి, గోవిందరాజులు, తిమ్మారెడ్డి, జిలాన్, రాధాకృష్ణ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన టీడీపీ నాయకులు


కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

తాడిపత్రిటౌన్, జూన్21: మండలంలోని తేరన్నపల్లి, బుగ్గ, గన్నెవారిపల్లికాలనీలో జేసీ అశ్మిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తేరన్నపల్లిలో మండల కన్వీనర్ నరేంద్రనాయుడు ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. బుగ్గలో టీడీపీ నాయకులు గంగాధర్‌యాదవ్, ఓబులేసుయాదవ్, గన్నెవారిపల్లికాలనీలో ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డి, డేరంగుల వెంకటరమణ, కోన రంగనాయకులు, కేశవ, కొండా వెంకటశివ, బంటు, నాగఫణి తదితరులు కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

కొడాలి నానికి మతి భ్రమించింది

పుట్లూరు, జూన్21: మాజీ మంత్రి కొడాలి నాని మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ఐ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అప్పటి అసెంబ్లీలో నువ్వు అన్న మాటలు అందరూ విని నీకు ఈ స్థాయి ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మంచి చెడులతో మాట్లాడాలని లేకపోతే టీడీపీ కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పుస్తకాల గదిని సీజ్ చేసిన ఎంఈఓ

గుత్తి, జూన్ 21: ఫీజులు, పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గుత్తి ఆర్ఎస్‌లోని ఏవీఆర్ పాఠశాల వద్ద శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఏవీఆర్ పాఠశాలలో అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆందోళన చేపట్టారు. దీనికి విద్యాధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ధ్వజమెత్తాడు. ఈనేపథ్యంలో ఎంఈఓ రవినాయక్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో పుస్తకాలు ఉన్న గది తాళం తీయాలని పాఠశాల ప్రిన్సిపాల్ సుశీల సింగ్‌ను ఆదేశించారు. ఆ గదిలో పెద్దఎత్తున పుస్తకాలను నిల్వ ఉంచడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గదిని సీజ్ చేశారు. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన విరమించారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి



గుత్తి, జూన్ 21: పట్టణంలోని ఎస్సీ కాలనీలో నాలుగేళ్ల బాలుడిపై శుక్రవారం వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అశోక్, సురేఖ దంపతుల కుమారుడు నానీ ఇంటి బయట ఆడుకుంటుండగా రెండు కుక్కలు మీదపడి కరిచాయి. బాలుడి మెడ, గొంతుకింద, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వాటిని తరిమేశారు. లేదంటే బాలుడికి ప్రాణహాని కలిగేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో మరో ముగ్గురిపైనా వీధి కుక్కలు దాడి చేశాయి. ఇటీవల పిచ్చి కుక్కల దాడులు కూడా పెరిగాయి. మున్సిపల్ అధికారులు కుక్కల బెడద నుంచి రక్షించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఎస్ఎస్ ట్యాంకుల పరిశీలన


తాగునీటి ట్యాంకుల వివరాలను నారాయణ స్వామికి చెబుతున్న మున్సిపల్ ఇంజనీరు

గుంతకల్లు, జూన్ 21: పట్టణంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను, ఫిల్టర్ బెడ్లను, హంద్రీనీవా, జీబీసీలను టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. శుక్రవారం ఉదయం టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఎస్ఎస్ ట్యాంకులను పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరు ఎస్ఎస్ ట్యాంకులలో నిల్వ ఉన్న నీటి పరిమాణం, రోజువారీగా పట్టణంలో ఉన్న నీటి వినియోగాలు, ఎన్నిరోజులకు నీరు సరిపోతుంది అనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, వాల్మీకి సాధికార సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి మస్తానప్ప, కౌన్సిలర్లు కే కృపాకర్, గుడిపాటి అంజనేయులు, అహ్మద్‌బాషా, ప్రభాకర్, నాయకులు లక్ష్మినారాయణ, పజులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కళ్యాణదుర్గం , జూన్ 21: కంబదూరు మండలం దేవేంద్రపురం తండా గేటు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తూరు గ్రామానికి చెందిన బోయ నరసింహులు(45) మృతి చెందారు. ఈయన ద్విచక్రవాహనంపై వస్తుండగా కళ్యాణదుర్గం వైపు నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నరసింహులును కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నారు. మృతుడు నరసింహులుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భూ ఆక్రమణపై ఆర్డీఓకు ఫిర్యాదు

గుంతకల్లుటౌన్,జూన్21: పట్టణంలోని బళ్లారి సర్కిల్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డికి శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాదిగ ఫిర్యాదు చేశాడు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 424బీసీఈలో రూ. 5కోట్లు విలువ చేసే ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకుని 16 షాపులను నిర్మించు కున్నారన్నారు. ఇంకా మిగిలిన ఖాళీ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన అడ్డుకోలేదన్నారు. భూఆక్రమదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

యాడికి, జూన్21: మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో వైసీపీ నాయకులపై నమోదుచేసిన ఎస్సీ ఎస్టీ కేసుపై శుక్రవారం తాడిపత్రి డీఎస్పీ జనార్దన్‌నాయుడు విచారణ చేపట్టారు. టీడీపీ కార్యకర్త, బాధితుడు ఓబన్నను సంఘటన జరిగిన ప్రాంతం వద్దకు తీసుకువెళ్లి సంఘటన జరిగిన తీరుపై ఆరాతీశారు. 27 మంది వైసీపీ నాయకులు తనపై మూకుమ్మడిగా దాడిచేశారని, తాను దళితుడనే వైసీపీ నాయకులు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని బాధితుడు ఓబన్న డీఎస్పీ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పుడు దాడిచేసిన వారు గతంలో కూడా తనపై దాడిచేశారని అప్పుడు కూడా వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని తెలిపాడు. పలు దఫాలుగా తనకు అన్యాయం జరుగుతూనే ఉందని డీఎస్పీ ఎదుట వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎందుకు తొలగించరు ?

● ఎంపీడీఓను ప్రశ్నించిన టీడీపీ నాయకులు

విడపనకల్లు, జూన్ 21: మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జునను ఎందుకు తొలగించరు అంటూ టీడీపీ నాయకులు ఎంపీడీఓ కొండయ్యను శుక్రవారం ప్రశ్నించారు. మండల టీడీపీ నాయకులు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం చేరుకుని ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్‌ల తొలగింపు, రాజీనామా చేసిన వలంటీర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొని, రాజీనామా చేసిన హావళిగి ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున రాజీనామాపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇదివరకే ఆయన గ్రామ కార్యదర్శి సురేష్‌బాబుకు రాజీనామా అందించాడని, చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సురేష్‌బాబు నివేదిక పంపారన్నారు. హావళిగి ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైయింది. కాని ఇవేవి ఆధారాలు కాదు నాకు రాజీనామా లేటర్ రాలేదు నేను తొలగించలేను అంటూ ఎంపీడీఓ టీడీపీ నాయకులను దబాయించారు. ఈ విషయం మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బీడీ మారయ్య, మాజీ మండల కన్వీనర్ దేవేంద్ర, నాయకులు హనుమంతు, సర్పంచ్‌లు చంద్రశేఖర్, తిప్పారెడ్డి, తిమ్మరాజు, జనార్ధననాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీఓ తో వాగ్వాదం చేస్తుతున్న టీడీపీ నాయకులు